మోడీ చేతిలో.. బిఆర్ఎస్ రిమోట్

- కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుంది
- పార్టీ విజయభేరి సభలో రాహుల్, ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజల కలలను సిఎం కెసిఆర్ విస్మరించారని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను బిఆర్ఎస్ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని, అందుకే ఇప్పుడు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో.. దొరల తెలంగాణ కావాలో.. ప్రజల తెలంగాణ కావాలో ప్రజలే తేల్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో రాహుల్, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ముందుగా రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం రామానుజపురం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి పాల్గొన్నారు. వేదిక మీదికి చేరిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీకి ములుగు ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ నేత కొండ సురేఖ బతుకమ్మలతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవితంలో ఎప్పుడు ఇంత అందమైన, అద్భుతమైన ఆలయం ఇప్పటికీ చూడలేదంటూ రామప్ప ఆలయ విశిష్టతను కొనియాడారు. అమరవీరులు శ్రీకాంత్ ఆచారి ఆశలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం నడుచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చిందని, దాని ప్రకారమే 2014లో ఆ హామీని నిలబెట్టుకున్నామని, తమకు నష్టం జరుగుతుందని తెలిసినా తెలంగాణ ఇచ్చి ప్రజల కలను నిజం చేశామని తెలిపారు. కానీ ప్రత్యేక తెలంగాణలో సామాజిక న్యాయం జరగడంలేదని, బిఆర్ఎస్ ప్రభుత్వ మంత్రివర్గంలో కేవలం ముగ్గురు బిసి మంత్రులు మాత్రమే ఉండటం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని అభివర్ణించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎంతమందికి వచ్చాయో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కర్ణాటక, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, ధరణి పోర్టల్‌లో నిరుపేదల భూములను లాక్కున్నారని అయినా ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ఏ ఒక్క కేసునూ కేంద్ర ప్రభుత్వం నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్, బిజెపి, ఎంఐఎం మూడు పార్టీలు కలిసే స్నేహపూర్వకంగా పని చేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో బిసిల రిజర్వేషన్‌ను 27 శాతం నుంచి 23 శాతానికి తగ్గించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలోని ప్రజలందరి ఆకాంక్ష కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఇందుకోసం బిజెపిపై యుద్ధం చేస్తున్నామని స్పష్టంచేశారు. ఇందుకు అందరి సహకారం అవసరమని కోరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకం పేరుతో ప్రతి నెల రూ.2500 అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పేరుతో ప్రతి ఎకరాకు రూ.15000, రైతు కూలీలకు రూ.12వేలు అందిస్తామన్నారు. ఇందిరమ్మ పథకం పేరుతో రూ.ఐదు లక్షలు, నిరుపేదలకు రూ.4000 పెన్షన్, యువకులకు, నిరుద్యోగులకు రూ.5లక్షల ఆర్థిక సాయం, ఆడపిల్లలకు ఎలక్ట్రికల్ స్కూటర్ అందజేస్తామని, మేడారానికి జాతీయ హోదా కల్పిస్తామంటూ హామీల వర్షం కురిపించారు. బిఆర్ఎస్ మోడీ రిమోట్‌తో పనిచేస్తుందని ఆరోపించారు. గిరిజనులు ఆదివాసీల కలలను నెరవేర్చేందుకు ఇందిరా గాంధీ కృషి చేశారని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీ పథకాలను మొదటి రోజే అక్కడి క్యాబినెట్ అమలు చేసిందని, తెలంగాణలో సైతం అదే జరుగుతుందని వివరించారు. ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా సీతక్కను, భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా గండ్ర సత్యనారాయణరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావు టాక్రే, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ఎంపి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, నాయకులు మధుయాష్కి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జగ్గారెడ్డి, బలరాం నాయక్, పోడియం వీరయ్య, కొండా సురేఖ, పాల్గొన్నారు.

ప్రియాంక, రాహుల్ గాంధీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

72 మంది పిల్లలను రక్షించిన ఆర్‌పిఎఫ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) సెప్టెంబర్ నెలలో ఆపరేషన్ 'నాన్హే ఫరిస్తే' కార్యక్రమం ద్వారా 72 మంది పిల్లలను రక్షించిందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. అలాగే ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.1.94 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వేరక్షణ దళం (ఆర్‌పిఎఫ్)కు రైల్వే ఆస్తుల పరిరక్షణ, ప్రయాణీకుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న పలువురు దొంగలను కూడా అరెస్టు చేసినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హెచ్‌ఎంలు, టీచర్ల వేతనాలు విడుదల చేయాలి

- ట్రెజరీ శాఖ డైరెక్టర్‌తో టిఎస్‌యుటిఎఫ్ చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గతనెలలో బదిలీ అయిన లేదా పదోన్నతి పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (జీహెచ్‌ఎం), ఉపాధ్యాయుల వేతనాలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ట్రెజరీ శాఖ డైరెక్టర్‌ను టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి కలిసి బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపుపై చర్చించారు. ఈనెలలో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు పాత స్టేషన్‌లో గతనెల 30 వరకే ఎల్‌పిసి తీసుకుని ఈనెల ఒకటి నుంచి రిలీవ్ అయిన వరకు నాన్ డ్రాయల్ సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు. కొత్తస్టేషన్‌లో ఈనెల ఒకటి నుంచి రెగ్యులర్ జీతాలను క్లెయిమ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆ విధంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నారని వివరించారు. ఎవరైనా ఈనెల రెండు, మూడు లేదా ఆ తర్వాత తేదీలతో ఎల్‌పిసి తీసుకుని ఉంటే వెంటనే ఐఎఫ్‌ఎంఎస్‌లో సందేహం పెడితే ఎల్‌పిసిని రద్దు చేస్తారని తెలిపారు. గతనెల 30 వరకు ఎల్‌పిసి తిరిగి ఇవ్వాలని పేర్కొన్నారు. ఈనెలకు నాన్ డ్రాయల్ సర్టిఫికెట్ తీసుకుని కొత్త స్టేషన్‌లో జీతాన్ని క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు. గతనెలలో బదిలీ అయిన, పదోన్నతి పొందిన జీహెచ్‌ఎంల సప్లిమెంటరీ వేతనాలు రూ.25 కోట్లలోపే ఉంటాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. దీనిపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో మాట్లాడి వీలైనంత త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

నేడు ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులపై అధికారుల వేధింపులు నిలుపుదల చేయాలని కోరుతూ గురువారం డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని టిఎస్‌ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. ఇటీవల బండ్లగూడ డిపోలో అధికారుల వేధింపులు భరించలేక మహిళా కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు ఆ డిపో ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాయి. ఆత్మహత్యలు వద్దనీ, ఆత్మస్థైర్యంతో పోరాడదామని జెఎసి చైర్మన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ యాదయ్య కోరారు. ఉద్యోగుల అక్రమ బదిలీలు, సస్పెన్షన్లు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల అధికారులు, సూపర్‌వైజర్ల వైఖరి మారాలని చెప్పారు. యూనియన్లకు అతీతంగా టిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులందరూ బ్యాడ్జీలు ధరించి, యాజమాన్యానికి, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా నిరసన తెలపాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ప్రవళిక మృతిని రాజకీయం చేశారు
- కరీంనగర్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హదరాబాద్ బ్యూరో

అభివృద్ధిని చూసి ప్రజలు బిఆర్ఎస్‌కు ఓటేసి ఆశీర్వదించండని మంత్రి కెటిఆర్ కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మానగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది కరీంనగర్ గడ్డమీదనేనని అన్నారు. గంగులనే కాదు వినోద్‌ను గెలిపించాలని, మానకొండూరు, చొప్పదండిలో కూడా కారు గుర్తును గెలిపించాలని కోరారు. హిందూ ముస్లింల మధ్య కొట్లాటలు పెట్టే సన్నాసులు కరీంనగర్‌లో ఉన్నారని విమర్శించారు. కమలాకర్‌పై పోటీ చేసేందుకు అందరూ జంకుతున్నారన్నారు. కాంగ్రెస్ టికెట్ ఇస్తామంటే భయపడి పారితున్నారని, ఇప్పటికే ఒకరు హుస్నాబాద్ పారిపోయారని ఆరోపించారు. బిజెపి వాళ్లు పోటీకి వెనకా ముందు ఆడుతున్నారని అన్నారు. మోడీ దేవుడని అంటున్న బండి సంజయ్ గ్యాస్ ధర ఎంత పెరిగిందో చెప్పాలన్నారు. రాహుల్ వస్తాడు.. ప్రియాంక వస్తుంది.. మోసపోకండి... కారు గుర్తుకు ఓటేసి కెసిఆర్‌ని దీవించండని కోరారు. ప్రవళిక మృతిని రాజకీయానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. వారి కుటుంబం తన దగ్గరకు వచ్చిందని.. వారి అమ్మాయిని వేధించారని చెప్పారని తెలిపారు. వారికి న్యాయం చేస్తామని, ఆ అమ్మాయి తమ్ముడికి ఉద్యోగం ఇస్తామని చెప్పామన్నారు. సభలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, జడ్‌పి చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, ఎల్.రమణ, నగర మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లస్వరూపరాణీ హరిశంకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న కెటిఆర్

ఎన్నికల ఫిర్యాదులపై ప్రచారం కల్పించండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల సందర్భంగా ఫిర్యాదులు ఎలా చేయాలి అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహనతోపాటు ప్రచారం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సి-విజిల్, ఎన్నికల ఫిర్యాదుల మానిటరింగ్ సెల్‌లో ప్రజలు, రాజకీయనాయకులు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా సమీకృత అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ఉమ్మడి జిల్లా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సి-విజిల్ యాప్‌పై గ్రామాల్లో పోస్టర్లు వేయాలని చెప్పారు. ఓటు వినియోగం, దాని ప్రధాన్యత వంటి అంశాలపై ప్రజలకు ఎక్కువ సమాచారం అందించాలనీ, దీనివల్ల ఓటింగ్ శాతం పెరగుతుందని వివరించారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలనీ, సువిధ యాప్ ద్వారా అన్నిరకాల అనుమతులు ఒకే చోట ఇవ్వాలనీ, శాంతిభద్రతల సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామనినేషన్లు, బ్యాలెట్ పేపర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జీ రవినాయక్ ఎన్నికల సంసిద్ధతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గఅనంతరం మహబూబ్‌నగర్ జిల్లా సమీపంలోని జయప్రకాష్‌నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు.

భారీగా నగదు, మద్యం స్వాధీనం

అక్టోబర్ 9 నుంచి 18వ తేదీ వరకు మొత్తం రూ.77.87 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే రూ.8.99 కోట్ల విలువైన 59,091 లీటర్ల మద్యం, 18,088 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. రూ.7.55 కోట్ల విలువైన గంజాయి, ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.62.73 కోట్ల విలువైన బంగారం, వెండి, వజ్రాలు స్వాధీనం చేసుకున్నారు. రూ.8.64 కోట్ల విలువైన ల్యాప్‌ట్యాప్‌లు, వాహనాలు, కుక్కర్లు, చీరలు, క్రీడాసామాగ్రిని తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ.165.81 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

టిసిఇఐ స్త్రీ శక్తి అవార్డుల ప్రదానం

హైదరాబాద్ : తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టిసిఇఐ) ఆధ్వర్యంలో 6వ సిబిస్ షాపింగ్ మాల్ స్త్రీ శక్తి అవార్డ్స్ - 2023ను వేడుకగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో జరిగిన అవార్డు వేడుకలో 50 మంది మహిళలను అవార్డులతో సత్కరించారు. ఈ అవార్డులను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా అందజేశారు. టిసిఇఐ స్త్రీ శక్తి, స్త్రీ మూర్తి, స్త్రీ రత్న తదితర మూడు కేటగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. టిసిఇఐ అధ్యక్షులు ఎ.బలరామ్ మాట్లాడుతూ.. వివిధ రంగాలలోని మహిళల విశిష్ట సేవలను గుర్తించే జాతీయ వేదికగా స్త్రీ శక్తి అవార్డులు రూపుదిద్దుకున్నాయన్నారు.

అవార్డులు ప్రదానం చేస్తున్న గవర్నర్

మహిళా ఉద్యోగుల బతుకమ్మ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మిషన్ భగీరథ శాఖకు చెందిన రాష్ట్ర కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, ఇంజినీర్లు, సిబ్బంది బతుకమ్మ ఆడారు. బుధవారం హైదారాబాద్‌లోని ఎర్రంమంజిల్‌లో ఈ రెండు శాఖల ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యాలయం ప్రధాన ద్వారా బతుకమ్మ ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు రజిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీజ డెయిరీ సంస్థకు అంతర్జాతీయ అవార్డు

హైదరాబాద్ :చికాగోలో జరుగుతున్న ప్రపంచ పాడిపరిశ్రమ సదస్సులో మహిళా డెయిరీ సంస్థ శ్రీజకు అంతర్జాతీయ అవార్డు దక్కినట్లు ఆ సంస్థ తెలిపింది. పాడి పరిశ్రమ రంగంలో మహిళా సాధికారతలో ఆవిష్కరణకుగానూ అవార్డును అందుకున్నట్లు పేర్కొంది. దాదాపు 1.20 లక్షల మంది మహిళా పాడి రైతుల తరపున ఈ అవార్డును స్వీకరించినట్లు శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయతీర్థా చారి పేర్కొన్నారు. ఈ సంస్థ తిరుపతి కేంద్రంగా పని చేస్తోంది. దేశంలోని మహిళా పాడి రైతులకు, సంస్థకు ఈ గౌరవం లభించడం గర్వించదగ్గ విషయమని శ్రీజ ఛైర్‌పర్సన్ కె శ్రీదేవి పేర్కొన్నారు. తమ సంస్థ ఏపి, తెలంగాణ, తమిళనాడులోని 11 జిల్లాల్లో విస్తరించి ఉందన్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు, మద్యం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ లింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద కారులో రూ.5.30 లక్షల నగదు, మల్లాపూర్ మండలం ఓబులపూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.1.97 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేనందున మొత్తం రూ.7.27 లక్షల నగదును సీజ్ చేసి సంబంధిత జిల్లా అధికారులకు పంపినట్టు మెట్‌పల్లి సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద విత్తన వ్యాపారీ ఎలాంటి రశీదు లేకుండా తీసుకెళ్తున్న రూ.40 లక్షలను పోలీసులు పట్టుకున్నట్టు ఉట్నూర్ డిఎస్‌పి నాగేందర్ వివరాలను తెలియజేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వన్‌టౌన్ సిఐ బన్సీలాల్, ఎస్ఐ, సిబ్బందితో కలిసి కాంట ఏరియా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టి ఎలాంటి రశీదులు లేని రూ.4.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో నగదు కలిగి ఉన్న సిరికొండ కనకయ్య నుంచి రూ.3 లక్షలు, వడ్నాల నర్సయ్య నుంచి రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పజెప్పారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల్ పడియాల్‌తాండా వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా.. ఓ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.7.5 లక్షలు, మాడ్గి చెక్‌పోస్ట్ వద్ద మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో రూ.3.లక్షలు మొత్తంగా రూ.10.5.లక్షలను పోలీసులు సీజ్ చేశారు. అలాగే న్యాల్కల్ మండలంలోని హుసెల్లి సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి వస్తున్న ఆటోలో తరలిస్తున్న 60 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలకేంద్రంలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో నలుగురు వ్యక్తుల నుంచి రూ.2.16 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

బిఆర్ఎస్‌కు భారీ షాక్..

- హస్తం గూటికి సుధీర్ రెడ్డి, శరత్ చంద్రా రెడ్డి
- కండువా కప్పి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి
- బయ్యారంలో భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధుల రాజీనామా..
- పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జన బలంతో ముందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. నోట్ల కట్టలతో వచ్చే వాళ్లకు బుద్ధి చెప్పాలన్నారు. బుధవారం మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి.. బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతాప సింగారంలోని మలిపెద్ది సుధీర్ రెడ్డి నివాసానికి వెళ్లిన రేవంత్ రెడ్డి.. సుధీర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి గొప్ప నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎమ్మెల్యేగా మేడ్చల్ నియోజకవర్గాన్ని సుధీర్ ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే మేడ్చల్ ప్రాంతాన్ని అన్ని రకాల అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. టికెట్ రాని వారు తనను తిట్టినా కుటుంబ పెద్దగా వాళ్ల బాధను అర్థం చేసుకుంటున్నానని.. వారికి భవిష్యత్‌లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మలిపెద్ది సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను ఇష్టానుసారంగా కబ్జా చేసి ప్రజల సొమ్మును దోచుకున్న మంత్రి మల్లారెడ్డి నుంచి ఈ ప్రాంతాన్ని విముక్తి చేయడమే మనందరి ఏకైక లక్ష్యమని స్పష్టంచేశారు. మేడ్చల్ అసెంబ్లీ నుంచి తోటకూర వజ్రేష్ యాదవ్ (జంగయ్య యాదవ్) గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాగా, రేవంత్‌రెడ్డి వచ్చే ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సుధీర్‌రెడ్డి ఇంటి ముందు సందడి నెలకొంది. అయితే ఎన్నికల అధికారులు ఎంపిడిఒ అరుణ, ఇతర అధికారులు ర్యాలీలకు, సమావేశాలకు అనుమతి లేదని సుధీర్ రెడ్డిని ఇంట్లోకి వెళ్లి ప్రశ్నించగా తన ఇంట్లోకి వచ్చి ఇలా అడగడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేడ్చల్, ఉప్పల్ నియోజక వర్గాల అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బయ్యారంలో ప్రజాప్రతినిధుల రాజీనామా..

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ ఇస్తూ.. మండలానికి చెందిన తొమ్మిది మంది సర్పంచులు, ఇద్దరు ఎంపిటిసిలు, ఆరుగురు ఉప సర్పంచులు, ఐదుగురు సొసైటీ డైరెక్టర్లు, పలువురు వార్డు మెంబర్లు, పార్టీ ముఖ్య నాయకులు బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రచార కమిటీ కో-చైర్మెన్, ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు భరత్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య.. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఓవైపున బిఆర్ఎస్ అసంతృప్తుల నిరసన జరుగుతున్నా.. ఎమ్మెల్యే దంపతులు తమ వైఖరి మార్చుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీకి తీవ్రనష్టం జరుగుతుందన్నారు. మండలంలో ఎమ్మెల్యే దంపతులు పర్యటించి దళితబంధు, గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ లాంటి పథకాలు వారం, పది రోజుల్లో మంజూరు చేస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం గిరిజన, ఆదివాసీ, దళితులతో పాటు సామాన్య ప్రజలను సైతం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పడిగాపులు కాసినా రాని పథకాలు ఎన్నికల కోడ్ అమలులో ఏ విధంగా మంజూరు చేస్తారో పాత్రికేయుల సమక్షంలో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం : వైఎస్ఆర్‌టిపి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే చేయాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వైఎస్ఆర్‌టిపి అధికార ప్రతినిధి పిట్టా రామిరెడ్డి చెప్పారు. ఈ ప్రక్రియ నాలుగు రోజులతోపాటు కొనసాగుతున్నదని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి 377 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు ఐదు నుంచి 10 అప్లికేషన్స్ వస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్‌లో సీటు దక్కని నేతలు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. త్వరలోనే తమ పార్టీ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామన్నారు.

In the Court ot the Motor Accident Claims Tribunal (Hon'ble 1st Additional Dist. Judge), Eluru, W.G.Dist.
M.V.O.P. No. 317/2023
Between:
Cheemala Narasimha Rao & others ...*Petitioner*
&
Dasamoni Raju & Others ...*Respondents*
To:
R-1: Dasamoni Raju, S/o. Lakshmaiah, Driver of Lorry bearing No. TS 07 UK 4958, Resident of D.No. 1-71/1, Gouse konda, Pochampalli Yadadri Dist 508284.
R-2: Maha Lakshmi Traders, Rep. by authorozed signatory (Jagan Eerati) Saroor Nagar, Hyderabad. Owner of Lorry bearing No: TS 07 UK 4958, Resident of D.No. 8-16-58, Mallikharjuna Nagar, Chintalkunta Check Post, L.B.Nagar, Saroor Nagar Mandal, Rangareddi District, Telangana State 500035.
అను వారికి నోటీసులు అమలు కొరకు ది. 08-11-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
కె.వి.వి.సూర్యనారాయణరెడ్డి, అడ్వకేట్
ఏలూరు అమీనాపేట, ఏలూరు
ది.11-10-2023 సెల్: 9959312346

BEFORE THE CHAIRMAN MACT CUM- PRL. DISTRICT JUDGE AT SIDDPET:
MVO.P.No:51of 2019
BETWEEN:
Ramdev Surendar. ...Petitioner
AND
1. N. Thirupathi @ Thirupathaiah s/o Ramaiah, aged about 37 years, Occ:Driver of the crime vehicle mini lorry bearing Registration No. AP28TD4154, Resident of H.no. 12-82, Molkamamidi, Amarabad, Nagarkarnool.
2. Sai Sharan Yamjal s/o Srinivas Reddy Yamjal, aged about 37 years, Occ: the owner of the Crime vehicle bearing mini lorry bearing Registration No. AP28TD4154, Resident of 3-44, Thenugubasti, Near: Masjid, Kompally, Quthbullapur (m),
Respondents no. 1& 2
N O T IC E
Take notice that in the above said matter, the claimant filed case against you for compensation. The above - mentioned Respondent no. 1&2 are avoiding receiving the court notice through court and Register Post. The above-said matter is posted on 09-11-2023 at 10-30 am for your appearance personally or through an advocate to answer the matter, otherwise the Honourable Court will decide the matter as the Honourable Court deems fit and proper in the circumstances of the case.
By
Court order through
9440081156
S. Janaradhan reddy
Advocate, Siddipet

NOTICE
Notice of Will Enquiry Under Section 41 (2) of Registration Act 1908: WilCASE No. 1OF 2023
Notice is hereby given to all whom so ever it may concern that Mr. Bethireddy Tatareddy S/o. Mr. B. Sur .yanarayana Reddy aged about 36 years Occupation Advocate, Resident of House No. 6-6-404/2, Behind CGO Towers, Gandhi Nagar, Secunderabad, Hyderabad .District - 500 080, Telangana State, presented on 16th August, 2023 before me a Will alleged to have been executed on 16th April,2021 by his mother late Smt. Bethireddy akshmikantham W/o; Sri B. Suryanarayana Resident of House No. 6-6-404/2, Behind CGO Towers, Gandhi Nagar, Secunderabad, Hyderabad District - 500 080, Telangana State, bequeathing her immovable and movable properties situated at Poduru village and Mandal, West Godavari District, Andhra Pradesh and Hyderabad in favour of (1) Mr. Bethireddy Suryanarayana S/o. Mr. late B. Tata Reddy aged about 72 years (Husband) (2) Ms. Bethireddy Bhavani D/o. ate S.R. Bethireddy aged 47 years (Daughter) (3) Mr. Bethireddy Tatareddy S/o. Mr. B. Surtyanarayana Reddy aged about 36 years (Son) all are resident of Secunderabad Telangana State, for registration of the Will after her death (Testatrix) under Section 41 (2) (b) of the Registration Act 1908 and the enquiry will be held by the under signed on 04-11-2023.
All those interested are hereby requested to appear before the Enquiry Officer, on the above date with their witnesses and other evidence if any in support of their contentions. If witnesses on behalf of any one to be summoned, application together with required fee should be credited with the enquiry officer fifteen days before the date fixed for enquiry.
SCHEDULED "A" IMMOVABLE PROPERTIES
(1) all that Flat bearing No. 101, in Imperial House, situated at 6-3- 865/A, Ameerpet, Hyderabad - 500 016.
(2) Agriculture land admeasuring 0.50 cents (including 0.40 cents of coconut garden) situated under survey Nos. 65-3 and 67-2, situated at Kavitam and 0-72 cents of agriculture lands situated under survey No. 159/1, situated at Poduru village (near Kavitam locks) Poduru Manda, West Godavari District, Andhra Pradesh state.
SCHEDULED "B" MOVABLE ASSETS
(1) the moveable properties all that Term deposits in various Banks, Deposit under Senior Citizens savings scheme in SBI and PPF Account in Secunderabad HPO in her name and Saving Bank Accounts in SBI and Indian Bank jointly with my husband and Gold ornaments weighing about 350 grams
Dated: 18-10-2023:
Office of the Sub-Registrar Secunderabad at Kavadiguda:

బోథ్ ఎమ్మెల్యే బాపూరావు రాథోడ్‌పై చీటింగ్ కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బోథ్ ఎమ్మెల్యే బాపూరావు రాథోడ్‌పై చీటింగ్ కేసు నమోదైంది. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాలతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. 2012లో విక్రయించిన రెండు ఇళ్ల స్థలాలను రెండోసారి అమ్మారని.. ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లారు. తనను బాపూరావు మోసం చేశారని తెలిపారు. దీంతో కోర్టు ఆదేశాలతో.. బాపూరావు, సుదర్శన్‌పై పలు సెక్షన్ల కింద ఆదిలాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా, ఎమ్మెల్యే బాపూరావు బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన మరుసటి రోజే ఆయనపై కేసు నమోదుకావడం విశేషం.

ఐఐటి విద్యార్థి బలవన్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్ఠాత్మక ఐఐటి ఖరగ్‌పూర్‌లో తెలంగాణకు చెందిన విద్యార్థి మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యాసంస్థ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన కిరణ్ చంద్ర ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కిరణ్ చంద్ర తన ఇద్దరు రూమ్‌మేట్స్‌తో కలిసి మంగళవారం రాత్రి 7.30 గంటల వరకు గదిలోనే ఉన్నాడు. వాళ్లిద్దరూ బయటకు వెళ్లి 8.30గంటల సమయంలో వచ్చి చూసేసరికి గది లోపలి నుంచి లాక్ చేసి ఉంది. వెంటనే అప్రమత్తమైన విద్యార్థులు, భద్రతా సిబ్బంది తలుపులు పగలగొట్టారు. అప్పటికే ఆతను ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానం చేశాడు. వెంటనే కిరణ్ చంద్రను బీసీరాయ్ టెక్నాలజీ ఆస్పత్రికి తరలించారు. రాత్రి 11.30గంటల సమయంలో పరిస్థితి విషమించి అతడు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు తెలిపారు. అయితే, విద్యార్థి ఆత్మహత్యకు కారణాలంటనేది మాత్రం తెలియలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విద్యాసంస్థలో ఏడాదిన్నరలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపుతోంది.

ఎల్‌జి ప్రచార విజేత ఎంపిక

హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఎల్‌జి తన 'ఇండియా కా సెలబ్రేషన్' ప్రచారంలో ఎంపికైన విజేతను ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన షేక్ సలవుద్దీన్ సెప్టెంబర్ 16న రిఫ్రిజిరేటర్‌ను కొనుగోలు చేసి ఎల్‌జి డ్రీమ్ హోమ్ ప్యాకేజీ విజేతగా నిలిచారని ఎల్‌జి ఇండియా ప్రతినిధులు కె శశి కిరణ్ రావు, జీవన్ కొమ్మినేని తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా నవంబర్ 12 వరకు తమ ఉత్పత్తులను కొనుగోలు చేసి డ్రీమ్ హోమ్ ప్యాకేజీని గెలుచుకోవచ్చని పేర్కొన్నారు.

ఏం హామీలను నెరవేర్చాలో ప్రజలకు చెప్పాలి : జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏం నెరవేర్చారో చెప్పి ఓట్లు అడగాలని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి సమక్షంలో పాలకుర్తి జడ్‌పిటిసి కందుల సంధ్యారాణి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు బిజెపిలో చేరారు. ఈ ఎన్నికల్లో కేవలం డబ్బులనే నమ్ముకుని కెసిఆర్‌కు ముందుకెళ్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై బిఆర్ఎస్ నాయకులు ఎక్కడా మాట్లాడంలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, రుణమాఫీ, దళిత బంధు, గిరిజన బంధు, దళితులకు మూడెకరాల వంటి హామీలను నెరవేర్చకుండా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందిందని విమర్శించారు. తమ నిర్లక్ష్యం, అసమర్థతతో ఉద్యోగాలు భర్తీ చేయకుండా, పేపర్ లీకేజీలకు కారణమై యువత, నిరుద్యోగులను వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కెసిఆర్ అని ఆరోపించారు. తెలంగాణ విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న రాహుల్‌గాంధీ ఏం మొహం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారని ప్రశ్నించారు. గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు.

ఆకలి జిల్లాలో పరుగెడుతున్న అభివృద్ధి

- నీటి సామర్థ్యం లేని జూరాలతో సాగునీరు ఎలా సాధ్యం
- ప్రతిపక్షాలవి అవగాహన లేని మాటలు
- అభివృద్ధికి సహకరించడమే కాదు బిఆర్ఎస్‌ను అధికారంలో నిలబెట్టండి
- ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయం పాడుబడి తిండి గింజలు లేక ఆకలి చావులు జరిగే పాలమూరులో అంబలి కేంద్రాలతో ఆకలి తీర్చుకునే స్థాయి నుంచి పాలు గూరే జిల్లాగా అభివృద్ధిలో దూసుకుపోతున్నదని, హైదరాబాద్‌లో మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్నారు. బుధవారం మేడ్చల్, జడ్చర్ల నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ ప్రసంగించారు.

మేడ్చల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సమైక్య పాలనలో అరిగోసలు పడ్డ తెలంగాణ.. నేడు స్వరాష్ట్ర పాలనలో దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా మారిందని చెప్పారు. ఆనాడు తెలంగాణలో కరెంట్, మంచినీరు లేదని, అడుగడుగునా వివక్షకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రాలో అప్పటి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అహంకారపూరితంగా.. తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వను ఏం చేసుకుంటారో చేసుకోవాలని అంటే.. కాంగ్రెస్ నాయకులు నోరెత్తలేదని గుర్తు చేశారు. నేడు స్వరాష్ట్రంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామికి చేరిందన్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఎల్బీ నగర్, ఉప్పల్ ఓ మినీ భారతమనీ, ఇక్కడికి ఎంతో మంది పొట్ట చేత పట్టుకుని వస్తారన్నారు. హైదరాబాద్‌కు వచ్చే వారు ఎక్కువగా ఇక్కడే స్థిరపడుతున్నారని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ చేర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఒక్క మేడ్చల్ నియోజకవర్గానికే 26 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న తెల్ల రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామన్నారు. పింఛన్లను దశల వారీగా పెంచుతామన్నారు. మల్లారెడ్డి లాంటి సమర్థవంతమైన నేత మేడ్చల్‌కు కీలకమని, ఈ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తెలంగాణ ప్రజలను కాల్చి చంపిన నాయకులకు అధికారం ఇస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కుర్మయ్య గారి నవీన్ కుమార్, ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్, మేయర్లు, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, మల్కాజ్‌గిరి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ అభ్యర్థి బండారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే చర్లకోల లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిఎం మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు పాలమూరు జిల్లాలో ఏ మూలకు వెళ్లిన పుట్టెడు దుఃఖం కష్టాలతో జిల్లా ప్రజలు వలస బాట పట్టే వారే మనకు కనిపించేవారు. ఇప్పుడు దేశ నలుమూలల నుంచి పాలమూరు జిల్లాకు వలసలు వస్తున్న విషయం గుర్తించుకోవాలన్నారు. రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించిన పాలమూరు కీర్తి చరిత్రలో శాశ్వతంగా ఉంటుందని తెలిపారు. గతంలో తాను, జయశంకర్ కలిసి నారన్నపేట వెళ్లి వస్తుండగా ఆ ప్రాంత బీడు భూములు ప్రజల బతుకులు చూసి కంట్లో నీళ్లు వచ్చాయన్నారు. నడిగడ్డ ప్రాంతమైన గద్వాల, అలంపూర్ పరిస్థితులు అలాగే ఉండేవన్నారు. తలాపున నీళ్లు ఉన్నా గుక్కెడు తాగునీళ్లు నోచుకోని దయనీయ స్థితి నుంచి.. ఇప్పుడు మిషన్ భగీరథ తెచ్చి ఇంటింటికి తాగునీరు అందించామని గుర్తు చేశారు. కిడ్నీలు ఫెయిల్ అయిన వారు హైదరాబాద్‌కు వెళ్లకుండా ఇక్కడే డయాలసిస్ వసతి కల్పించామన్నారు. ఎగువల జూరాల ఉన్న మాట వాస్తవమే కానీ అందులో కేవలం తొమ్మిది టిఎంసిలకు మించి నీళ్లు నిలువ ఉంచమన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు అవసరమైన 120 టిఎంసిల నీళ్లు అందాలంటే అది శ్రీశైలం ద్వారానే సాధ్యమని గుర్తు చేశారు. అందుకే ప్రతిపక్ష పార్టీలు ఎంత గగ్గోలు పెట్టినా నేనే డిజైన్ చేసి పాలమూరు-రంగారెడ్డిని రూపొందించానన్నారు. ఇక పాలమూరు అభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరం కాదన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, పోతన పథకాలను పూర్తి చేసుకోవడం ద్వారా బంగారు పంటలు పండుతాయన్నారు. మరోసారి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బాప్కారి శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, శాంత కుమారి, రజిని, చెల్లా వెంకటరామిరెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక కుటుంబానికి ఆదుకుంటానని హామీ ఇస్తున్న మంత్రి కెటిఆర్

ప్రవళిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ హామీ ఇచ్చారు. ప్రవళిక కుటుంబసభ్యులతో బుధవారం ప్రగతిభవన్‌లో కెటిఆర్ కలిసి మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రవళిక కుటుంబానికి జరిగిన నష్టాన్ని పూడ్చలేం అని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకుని చట్టపరంగా శిక్షపడేలా చూస్తామన్నారు. కెటిఆర్‌ను కలిసిన అనంతరం ప్రవళిక సోదరుడు ప్రణయ్ మాట్లాడుతూ.. కేసు పురోగతిపై డిజిపితో కెటిఆర్ మాట్లాడినట్లు చెప్పారన్నారు. తమ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో కెటిఆర్‌ను ప్రవళిక తల్లితండ్రులు, తమ్ముడు ప్రణయ్ కలిశారు. కాగా, ఇదే విషయంపై మంత్రి కెటిఆర్ కరీంనగర్‌లో స్పందించారు."ప్రవళిక మృతిని కూడా రాజకీయం చేశారు. ప్రవళిక కుటుంబ సభ్యులు నా దగ్గరకు వచ్చారు.. న్యాయం చేయాలని కోరారు. ప్రవళిక కుటుంబాన్ని ఆదుకుంటాం. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తాం. అంతే కాకుండా ఆ అమ్మాయిని వేధించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు జరగకుండా ముందుగా జాగ్రత్తపడతాం." అని కెటిఆర్ తెలిపారు.

చుక్క గుర్తుకు ఓటేద్దాం

- కార్మికవర్గ ఐక్యతతో మరిన్ని చారిత్రక విజయాలు సాదిద్దాం : చుక్క రాములు
- శాండ్విక్‌లో నేడు కార్మిక సంఘం ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'చుక్క గుర్తుకు ఓటు వేద్దాం.. కార్మికవర్గ ఐక్యతతో మరిన్ని చారిత్రక విజయాలు సాధించుకుందాం' అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ (రి.నెం. ఏ-1001, సిఐటియు అనుబంధం) గేట్ మీటింగ్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పాల్గొని మాట్లడారు. మంగళవారం జరిగిన హెచ్ఎంఎస్ యూనియన్ గేట్ మీటింగ్‌లో ఆ యూనియన్ నాయకులు సీఐటీయూ నాయకత్వం మీద చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసత్య ఆరోపణలతో శాండ్విక్ కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలని చూస్తే అత్యంత చైతన్యవంతులైన శాండ్విక్ కార్మిక సోదరులు వారికి సరైన గుణపాఠం చెపుతారని తెలిపారు. 39 ఏళ్లుగా కార్మికులను కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ఒకే తాటిపై నడిపిస్తూ, నాటి విడియా నుండి నేటి శాండ్విక్ వరకూ అనేక యాజమాన్యాలు మారినా కార్మిక ప్రయోజనాల కొరకు సిఐటియు రాజీలేని పోరాటం చేస్తున్నదన్నారు. ప్రారంభ వేతనం రూ.43,450, 20 ఏండ్ల సర్వీస్‌కి రూ. 92,813, హైయస్ట్ రూ.1,20,916 వేతనాలు కార్మికులు పొందుతున్నారని చెప్పారు. విడిఎ 1960 సిరీస్‌లో ప్రతి పాయింట్‌కు రూ.4.25, గ్రాట్యుటీ ఏడాదికి 21 రోజులు, రూ.ఏడు లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ కుటుంబానికి ఆరుగురికి వర్తించేలా తల్లిదండ్రులు లేకపోతే అత్తమామలు చేర్చుకునే సౌకర్యం, 13 రోజులకు ఒక ఈ ఎల్ చొప్పున అదనంగా బోనస్ లీవ్స్, జిటి ఎల్ఐ పాలసీ, ప్రమోషన్ పాలసీ.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సౌకర్యాలు సాధించిన ఘనత సిఐటియుదేనని స్పష్టంచేశారు. 2024 జనవరి నుంచి 14వ వేతన ఒప్పందానికి వెళ్లాల్సి ఉందని, మరిన్ని మెరుగైన వేతనాలు, సౌకర్యాల కోసం కార్మికుల ఐక్యతతో యాజమాన్యంపై ఒత్తిడి చేసి సాధిస్తామన్నారు. ఎవరు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా, కల్ల బొల్లి మాటలు చెప్పినా చైతన్యవంతులైన శాండ్విక్ కార్మిక వర్గం గురువారం జరిగే ఎన్నికల్లో సిఐటియు చుక్క గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రత్యర్థులకు, యాజమాన్యానికి దిమ్మ తిరిగే జవాబు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేష్, జిల్లా నాయకులు, శాండ్విక్ యూనియన్ నాయకులు, వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆ ప్రచారంలో నిజం లేదు

- మంత్రి మహేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను పార్టీ మారుతున్నానంటూ జరిగే ప్రచారంలో నిజం లేదని మంత్రి పట్నం మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తనపై కాంగ్రెస్ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని.. అలాంటి ప్రచారాన్ని సహించేది లేదని తేల్చి చెప్పారు. బుధవారం తాండూరులో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో సమావేశమైన మహేందర్ రెడ్డి.. మంత్రిగా తన వాళ్లను గెలిపించుకునే బాధ్యత తనపై ఉందన్నారు. పైలెట్ రోహిత్ రెడ్డి గెలుపు కోసం పార్టీ సీనియర్ నాయకులంతా శ్రమిస్తున్నారని చెప్పారు. కొడంగల్‌లోనూ పట్నం నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అలాగే తాండూరు, వికారాబాద్‌లో కొంత మంది నాయుకులు పార్టీ మారినంత మాత్రాన బిఆర్ఎస్‌కు ఎలాంటి నష్టం లేదన్నారు. కొడంగల్, తాండూరు, వికారాబాద్, పరిగిలో బిఆర్ఎస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మహేందర్ రెడ్డి

వ్యాఖ్యానం విశ్లేషణలో పరిణితి ప్రదానం

- ప్రభుత్వ సలహాదారు కెవి రమణ

ప్రజాశక్తి - కల్చరల్

సామాజిక మాధ్యమాల్లోగానీ, మీడియాలోగానీ చేసే వ్యాఖ్యానం విశ్లేషణలలో పరిణితి, మాట్లాడే అంశంపై పూర్తి అవగాహన ప్రదానమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ అన్నారు. మాసబ్ టాంక్ వద్దనున్న రమణ నివాస కార్యాలయంలో ప్రముఖ మహిళా సాంస్కృతిక సేవా సంస్థ, రాగ సప్త స్వరం నిర్వహణలో అక్కినేని శత జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రఖ్యాత సినీ రాజకీయ విశ్లేషకుడు ఇమంది రామారావుకు అక్కినేని రాగ సప్త స్వర మానేపల్లి జువెలర్స్ రజిత పతకం ప్రధానోత్సావ సభ బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని రామారావును సత్కరించి మాట్లాడారు. సినీ నటుల జీవిత విశేషాలు వివరించడంతోపాటు విమర్శనాత్మక పరిశీలన చేయడంలో రామారావు సిద్ధహస్తులన్నారు. ఉత్తమ జర్నలిస్ట్ రామారావు అని కొనియాడారు. పురస్కార గ్రహీత రామారావు మాట్లాడుతూ దేశంలో సాంస్కృతిక రంగానికే పెద్ద దిక్కు రమణ నుంచి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. తాను యూట్యూబ్‌లో ప్రముఖుల గురించి చేసే విశ్లేషణలు, వ్యాఖ్యానాలు, వాస్తవ సంగతులని చెప్పారు. సంస్థ స్థాపకురాలు రాజ్యలక్ష్మి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అహల్య, సహాయ కార్యదర్శి సుందరవల్లి తదితరులు పాల్గొన్నారు. తొలుత రవి కుమార్, సిరిస్పందనల శాస్త్రీయ గీతాలు, రమణ కుమారి, సుబ్బులక్ష్మి, కస్తూరిల భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

'సూపర్ స్పెషాలిటీ' కోర్స్‌లో నిమ్స్ వైద్యునికి తొలి ర్యాంక్

- అభినందించిన డైరెక్టర్ బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆలిండియా నీట్ ఎస్ఎస్-2023 ప్రవేశ పరీక్షల్లో నిమ్స్ యువ వైద్యులు సత్తా చాటారు. ఆలిండియా తొలి ర్యాంక్‌ని జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ సుబ్రమణ్యం సాధించారు. మరో 11 మంది వైద్యులు ప్రభంజనం సృష్టించారు. శరత్ చంద్ర గౌడ్ -15, అభిషేక్ -32 , నవీన్ కుమార్ -35, భాను-49, కీర్తి-58, అభిలాష్-356, ఖలీల్-559, సుగుణ-656, నందిత-796, జాకీర్-870, దినేష్-1199 ర్యాంకులు సాధించారు. ఆలిండియా ర్యాంక్‌తో పాటు మెరుగైన ఫలితాలు సాధించిన యువ వైద్యులను నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ప్రత్యేకంగా అభినందించారు. యువ వైద్యులకు పరీక్షల సమయంలో ఒత్తిడి లేకుండా సౌకర్యాలను కూడా కల్పిస్తున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో డీన్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ నవల్ చంద్ర, ప్రొఫెసర్ వైఎస్ఎన్ రాజు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, డాక్టర్ శెట్టి, డాక్టర్ స్వరూప, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకోవాలి : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్ గాంధీ ఆయన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. ఎన్నికల వచ్చినప్పుడు వచ్చి ఏదో నాలుగు ముచ్చట్లు చెప్పి దాంతో నాలుగు ఓట్లు వస్తాయని అనాలోచితమైన చర్య అని విమర్శించారు. తెలంగాణ చాలా జాగరూకతతో వ్యవహరించే సమాజమని, ఈ చైతన్యం కలిగిన ప్రజలు అని చెప్పారు. బుధవారం ఆమె బోధన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపి నేతలకు ఎన్నికల టైమ్‌లో వచ్చి ఓట్ల కోసం మాయమాటలు చెప్పడం అలవాటుగా మారిందని ఆమె విమర్శించారు. తెలంగాణ ప్రజలు రాజకీయంగా చాలా చైతన్యం కలిగి ఉన్నారని, కల్లబొల్లి మాటలు నమ్మి ఓట్లేసే పరిస్థితిలో తెలంగాణ సమాజం లేదని ఆమె చెప్పారు. రాహుల్ గాంధీ ఇప్పుడు బిసి జనగణన గురించి మాట్లాడుతున్నారని, కానీ సంక్షేమంలో బీసీలకు పెద్దపీట వేసిందే కెసిఆర్ అనే సంగతి గుర్తుంచుకోవాలని కవిత హితవుపలికారు.

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న రేవూరి

- పరకాల నుంచి బరిలోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సమీకరణాలు అనూహ్యంగా మారుతున్నాయి. సీనియర్ నేతలు పార్టీలు మారుతుండటం చర్చనీయాంశంగా మారింది. జనగామ నియోజకవర్గానికి చెందిన పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్‌కు రాజీనామా చేసి సిఎం కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. తాజాగా నర్సంపేట నియోజకవర్గానికి చెందిన బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి భూపాలపల్లిలో నేడు (గురువారం) రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఇందుకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే 'రేవూరి'తో మంతనాలు జరిపి కాంగ్రెస్‌లో చేరేలా ఆయన్ను ఒప్పించి నర్సంపేటకు బదులుగా పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దించడానికి కసరత్తు చేశారు. ఇక 'రేవూరి' అభ్యర్థిత్వం ఖరారు లాంఛనమేనని ప్రచారం జరుగుతోంది. పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతోపాటు ఇనుగాల వెంకట్రాంరెడ్డి పోటీపడుతున్నారు. వీరిద్దరి మధ్య రాజకీయ వైరుధ్యాలున్నాయి. ఈ క్రమంలో 'రేవూరి'ని కాంగ్రెస్‌లో చేర్చుకొని పరకాల బరిలోకి దించడంతో బిఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికి చెక్‌పెట్టేలా రంగం సిద్ధం చేశారు. దాంతో ఉమ్మడి వరంగల్ రాజకీయాలు బిఆర్ఎస్, కాంగ్రెస్ నడుమ రసకందాయంలో పడ్డాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం భూపాలపల్లిలో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. 'రేవూరి' గతంలో నర్సంపేట నియోజకవర్గం నుండి రెండుసార్లు టిడిపి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో తొలిసారి ఎంసిపిఐ నేత ఎం. ఓంకార్‌పై విజయం సాధించిన 'రేవూరి' టిడిపిలో కీలక నేతగా మారారు. జిఒ 610 సబ్ కమిటీకి చైర్మెన్‌గానూ వ్యవహరించారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, రేవూరి టిడిపిలో పనిచేసిన వారే కాకుండా మాజీ మంత్రి తుమ్మల ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో 'రేవూరి'ని కాంగ్రెస్‌లో చేరేలా ఒప్పించారు. అంతేకాదు, ఏకంగా పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా రేవూరి ప్రకాశ్‌రెడ్డిని రంగంలోకి దించనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు 'రేవూరి'కి పార్టీ హామీనిచ్చినట్టు సమాచారం. పరకాలలో కాంగ్రెస్ టికెట్ కోసం ఒకవైపు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పట్టుబడుతుండగా, మరో వైపు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఇనుగాల వెంకట్రాంరెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కొండా మురళీ భార్య మాజీ మంత్రి కొండా సురేఖకు పార్టీ టికెట్ ఇవ్వనున్నారు. కాగా, పరకాల బిఆర్ఎస్ అభ్యర్థిని ఎదుర్కొనడానికి 'ఇనుగాల' సామర్థ్యం సరిపోదన్న భావనలో పార్టీలో చర్చ జరుగుతున్న క్రమంలో 'రేవూరి' కాంగ్రెస్‌లో చేరడంతో పరకాలలో అభ్యర్థి సమస్య పరిష్కారమైనట్టుగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రేవూరి' స్వగ్రామం దుగ్గొండి మండలంలోని కేశవాపూర్. పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం సరిహద్దులోనే ఈ గ్రామం ఉంటుంది. ఆత్మకూరు మండలంలో పలు గ్రామాల్లో 'రేవూరి' బంధువర్గముంది. అంతేకాకుండా గతంలో టిడిపిలో పనిచేసిన నేతలతో 'రేవూరి'కి సన్నిహిత సంబంధాలున్నాయి. ఇది 'రేవూరి'కి లాభిస్తుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

కాసానితో ఎపి ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎపి ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఆమె భర్త డాక్టర్ శ్రీధర్ టిడిపి తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో భేటి అయ్యారు. బుధవారం ఎన్‌టిఆర్‌భవన్‌లో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు జ్ఞానేశ్వర్‌ను శాలువాతో సన్మానించారు. పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టు తదనంతర పరిణామాలపై చర్చించారు. ఈ భేటీలో రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షులు భవనం షకీలా రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భిక్షపతి. ఎపి ఐటీ ఉద్యోగులు, ఐటిడిపి నాయకులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ని సన్మానిస్తున్న ఉండవల్లి శ్రీదేవి తదితరులు

ఎసిబికి చిక్కిన ఎంపిఒ, పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిమెంట్, ఇటుకల తయారీ మినీ పరిశ్రమకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఎంపిఒ, పంచాయతీ కార్యదర్శి ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం రాచులూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. అవినీతి నిరోధక శాఖ ఎసిపి కె భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాచులూరు గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి వైష్ణవి సిమెంటు ఇటుకల మినీ పరిశ్రమ ఏర్పాటు కోసం పంచాయతీ కార్యదర్శి దేరంగుల నరేందర్‌ను అనుమతి కోరారు. రూ. 5 లక్షలు ఇస్తేనే అనుమతి ఇస్తామని నరేందర్ లంచం డిమాండ్ చేశారు. ఎంపిఒ కల్యాణిని అడిగినా ఇదే విషయం చెప్పారు. అంత డబ్బు తన దగ్గర లేదని రూ.రెండు లక్షలు ఇస్తానని మధుసూదన్ రెడ్డి వారిని వేడుకున్నా కనికరించలేదు. చివరిగా రూ.2.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధుసూదన్ రెడ్డి ఏమి చేయలేక జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో డైరెక్షన్ ప్రకారం.. మధుసూదన్ రెడ్డి బుధవారం రాచులూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి దేరంగుల నరేందర్‌కు రూ. 2.50 లక్షలు ఇచ్చారు. అనంతరం ఎసిబి అధికారులు గ్రామానికి వచ్చి పంచాయతీ కార్యదర్శి, ఎంపిఒను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారు తీసుకున్న రూ.2.50 లక్షలు నగదును సీజ్ చేశారు. ఎంపిఒ కల్యాణి, పంచాయతీ కార్యదర్శి దేరంగుల నరేందర్‌లపై అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు అవినీతి నిరోధక శాఖ ఎసిపి కె భద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్లు నరేష్ కుమార్, ప్రశాంత్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.